వ్యాసకర్త్రి

శ్రీమతి సావిత్రీదేవిగారు

ఈశ్వరశరణ్ గొప్పకవీశ్వరుడు. అతనివయస్సు ఎక్కువకాకపోయినా అతని కవిత్వముయొక్క ఘనత చాలాఎక్కువది. అతడు కలం పుచ్చుకున్నాడంటే అపశకృంకాదు. అతని వ్యాసములయొక్క చాతుర్యము, వర్ణన, భాష నిరుపమానములైనందున విన్నవారందరూ చాలా ఆహ్లాదపడుతూండేవారు. ఆకాలమందు అతని కవిత్వమును పొగడని పత్రిక లేదు. అతని పద్యములమీాద ఏవైనా విమర్శనలు వస్తే అన్నీచక్కగా సమర్థిస్తూ ఉండేవాడు. అతనిని చూసినవారు "అరుగో కవిమండలములో నక్షత్రమై వెలుగుతూన్న కవీశ్వరులు" అనుకుంటూఉంటేవిని ఊర్ధ్వమండలములలో విహారించినట్లే ఆనందించేవాడు.

ఈశ్వరశరణ్ భార్యపేరు ఎవరికీ తెలియదు. అతడుమాత్రం భార్యఅంటే ప్రాణసమానంగా ఎంచుకునేవాడు. ఆమె కంఠస్వరమంటే అతనికి ప్రాణం. ఆమె చిఱునగవతనికి శాంతిదాయకం. భాగీరథి స్వల్పవిద్యావతి. ఈశ్వరశరణ్ భార్యకికూడా పద్యాలుఅవీ వ్రాయాలని ఉండేది.

"ఎంత అదృష్టం! ఎటువంటి విద్యావతియైన భార్యదొరికింది!"అని స్నేహితులెప్పుడు అంటారా అనుకునేవాడు. అటువంటిరోజులకోసం తనసర్వస్వమూ ధారపోయడానికి సిద్ధంగా ఉండేవాడు.

"చక్కనివ్యాసముంది చూస్తావా?" అన్నాడుఈశ్వరశరణ్,పత్రిక భాగీరథికియిస్తూ.

"ముందీవ్యాసం అయినతరువాత ఆవ్యాసంచూస్తాను. ఏమిటాపత్రిక?"అన్నది భాగీరథి బట్టలు సర్దుతూ.

"వేయి కథలు ఉన్నవి."

"మీావ్యాసం ఇందులోఉన్నదా"

"ఉన్నది; కాని నేనింకొకవ్యాసం నీకు చూపించాలనుకుంటున్నాను. ఆవ్యాసం వజ్రకుమారి అనే ఆమెది."

"వజ్రకుమారి! ఈమెపేరు ఎప్పుడూ వినలేదే"

"ఔను; అపరిచితయే. కాని వ్యాసం చాలాగొప్పది. ఒకమాటు చదివావంటే ఆనందం పట్టలేవు." అనగానే భాగీరథిభర్తచేతిలోని పత్రిక లాక్కున్నది. ఆభరణములపెట్టె అయినా ఎవరూ అంతతొందరగా తీసుకోరు.

ఆకథ చదువుచున్నప్పుడు ఆమె ముఖమునందు కలుగుచున్న మార్పులనుబట్టి ఆమెకు కూడా ఆనందంగాఉన్నదని గ్రహించి "ఏం? ఎలాఉన్న"దనిఅన్నాడు ఈశ్వరశరణ్.

"చాలా బాగుంది. కళ్ళ ఎదుటనున్న ఛాయాచిత్రంలాఉంది" అంది భాగీరథి.

"ఔను నాఅభిప్రాయమూ అంతే. ఇది ఏతరగతిలో చేరుతుందని తలుస్తావు"?

"............................"

“ఏం ఆలోచిస్తున్నావు? ఇది వజ్రకుమారి పరీక్ష కాదు. నీపరీక్షకూడాను.”

“ఈమెను రెండవతరగతిలో చేర్చవచ్చు.”

“ఎందుకంత తగ్గించావు?”

“ఈమెను మొదటితరగతిలో చేరుస్తే నేనోడిపోతాను. నాలుగు చమత్కారం మాటలు చూడగానే దీనిబుద్ధి మందగించిం దనుకుంటారు.”

“చూశావా; ఆమెనుగురించి పత్రికాసంపాదకుని అభిప్రాయం.”

శ్రీమతి వజ్రకుమారి వ్యాసం మాపాఠకులయెదుట పెట్టుచున్నందులకు మేము చాలాసంతోషించుచున్నాము. ఇటువంటి మనోహరమగు వ్యాసము వెల్లడిచేయుగలిగినందుల కెంతయు—

“చాలు పొగడ్తలు; మీరు వ్రాసిన “గంగాతటము” అన్నదానిముందు ఇదియెంత? ఆపత్రికా సంపాదకుడు కనబడితే నే చెబుదును దీనిగొప్పదనం.”

“చండికాదేవివై పోయావే”అన్నాడు నవ్వుతూ.

“ఎందుకు నవ్వడం? ఈపొగడ్తలుచూస్తే నాకు వళ్లుమండుతుంది. వజ్రకుమారి గొప్ప వ్యాసకర్త్రి ఐపోయిందా? ఈమాత్రం అందరూ చెయ్యగలరు.”

“సరే గాని, భాగీరథీ, నువ్వుకూడా ఎందుకురాయకూడదూ? నిన్నూ ఇలాగే పొగుడుతారు. నేను సంతోషిస్తాను.”

“అక్కర్లేదు. నాకేం పొగడ్త లవసరం లేదు.”

“నీవు రాయనంటే ఊరుకుంటానా. నీచేత రాయిస్తాను గాని, నీవు ఉత్తరం రాస్తే ఎంత ఆకర్షణీయంగాను, గంభీరంగాను, చమత్కారంగాను ఉంటుంది. ఉత్తరాల్లో ఉండే సంగతులే వ్యాసంక్రింద రాసి చూడు.”

“ఆపని పురుషులదికాని స్త్రీలది కాదు.”

“ఎందుకు కాదు? వజ్రకుమారి స్త్రీ కాదా మరి.”

“ఆఁ; నాకన్నీ తెలుసును. భర్త చేత రాయించి తనపేర అచ్చువేయించింది. మీరూ రాయండి. నేనూ అలాగే చేస్తాను.”

“హాస్యం వదలిపెట్టు. ప్రయత్నం చేస్తావా చెయ్యవా?”

“చెప్పానుగా మీరు రాసిపెట్టండి.”

“మాఉపాధ్యాయులు మాకీపాఠం చెప్పలేదు.”

“ఆ! వ్రాసిపెడుదురూ. భాగీరథినిగురించి పత్రికలలోపొగడ్తలు పడతాయి. మీరు సంతోషించవచ్చు.”

“..............”

“మీకోసం అన్ని రాయగలరుగాని నాకోసం ఒకటీ రాయలేరు కాబోలు”

"ఎంత చవకగా పేరు సంపాదిద్దామనుకుంటున్నావు."

అని ఈశ్వరశరణ్ భాగీరథి వైపు చూచి నిట్టూర్పు నిగిడ్చి ఊరుకున్నాడు.

"..."

భాగీరథి మనస్సులో ఒకటే ఆలోచన. రోజూ భర్తతో "వ్యాసం ఎందుకు రాయరండీ?" అని పోరుతూవుండేది. "పైకిమాత్రం నన్నెంతో ప్రేమిస్తాననడం. కాస్త రాసి పెట్టమంటే తేలింది సంగతి. నాకే రాయడం వస్తేనా ఇప్పటికెన్ని రాసి మీపేర పంపేదాన్నో" అని సణుగుతూ ఉండేది. ఈశ్వరశరణ్ మాత్రం "నీకేం పిచ్చి! పేరు రావాలని ఉంటే కష్టపడినేర్చుకో. నేనలాంటి పనిచెయ్యను" అనేవాడు. ఆమాటలవల్ల ఆమెసణుగుడు హెచ్చైపోయేది. ఈశ్వరశరణ్ మాట్లాడకుండా ఊరుకుని "ఎంత పని చేసాను. నేను రాయమని ప్రేరేపించకపోతే ఈపోరు ఉండకపోను" అనుకునేవాడు. ఈవిధంగా కొన్నిరోజులు గడిచిపోయాయిగాని చివరకి ఈశ్వరశరణ్ లొంగిపోయాడు. పురుషుని అసమ్మతి ప్రేమ గల ప్రేయసివద్ద సాగుతుందా?

ఒక సంవత్సరం గడిచేటప్పటికి భాగీరథి పేరు కవిప్రపంచమందు మ్రోగింది. అందరూ ఆమె కలంనుంచి ఒక్కపంక్తి ఏ పత్రికలోనైనా వెలువడితే దానికోసమే నిరీక్షిస్తున్నారు. "ఈమె ఎవరో కవీశ్వరుల తల దన్ని నది. స్త్రీలు కేవలము గృహాంగనలుగానే నిర్మింప బడ్డారని ఇప్పుడెవరైనా అనగలరా?" అని అనుకోడం ప్రారంభించారు. భాగీరథి కాళ్లు భూమ్మీద నిలవడంలేదు. ఏపత్రికలో చూసినా తన నామమే. భర్తమీద ప్రేమ అతిశయించింది. అతని నిరసనమానం పొగుడుతూఉండేది. ఈశ్వరశరణ్ కూడా పత్రికలలో తన పత్ని పేరు చూసి పొంగిపోయేవాడు.

భాగీరథి ఎవరో ఈశ్వరశరణ్‌కి తప్ప ఇతరులకు తెలియదు. కీర్తి దాగదు. చివరకి తెలిసింది భాగీరథి ఈశ్వరశరణ్ భార్య అన్న రహస్యం. పత్రికాధిపతులు భార్యాభర్తలిద్దర్నీ అభినందిస్తూ ఉండేవారు. ఈశ్వరశరణ్ మాత్రం భయపడుతూ ఉండేవాడు. రెండవ రహస్యంకూడా బయటపడుతుందేమో నని ... ...

హిందూ బాలికా పాఠశాల వార్షికోత్సవము వచ్చింది. ఆపాఠశాల ప్రధానోపాధ్యాయిని వచ్చి భాగీరథిని ఆసభకు అధ్యక్షత వహించమని కోరింది. భాగీరథికి ఇష్టంలేకపోయినా ఆమె బలవంతంవల్ల ఒప్పుకోక తప్పిందికాదు. "ఎంత చెప్పినా వినలేదుకదా. అంతమందిలో నేనెలా మాట్లాడగలను?" అనుకుంది భాగీరథి.

ఈసంగతి ఈశ్వరశరణుతో చెప్పేటప్పటికి "నాలుగు వ్యాసాలు రాస్తే ఎంత పదవి వచ్చిందో చూశావా?" అన్నాడు.

"మీరు చెప్పినది నిజమే. కాని ఈగౌరవమంతా మీదానాదా?"

"నాదేముంది ? నేను ముందుజన్మ స్త్రీజన్మ రావాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను. స్త్రీ కోరింది వెంటనే నెఱవేరుతుంది."

"అబ్బా, అందఱూ మీలాంటివాళ్లే ఔతారా? సరేగాని అంతమందిలో ఎలాగండీ మాట్లాడడం?"

"సుళువుగా సంతకంచేసినట్లే అనుకొన్నావా?"

"మీరెప్పుడూ ఇంతే. మీతో మాట్లాడగూడదు."

"పొఱబాటు జరిగింది, క్షమించవూ?"

మర్నాడే ఈశ్వరశరణ్ ఊరికి వెళ్లవలసివచ్చింది.

"మంచి ఉపన్యాసం రాసి పంపిచాలి; మఱచిపోకూడదు. మఱచిపోతే ఇక్కడ చిక్కు వస్తుంది"అని భాగీరథి మఱీమఱీ చెప్పింది. ఈశ్వరశరణ్ వెళ్లగానే వార్షికోత్సవ సందర్భంలో ఆమె చదవడానికి మంచి ఉపన్యాసం వ్రాసి పంపించాడు. భాగీరథి అదిచూసి చాలా సంతోషించింది. "ఇదివఱకు నాపేరుతో చాలా వ్యాసాలు ప్రచురణ అయాయి గాని ఇంత గొప్పవి కావు. నే అధ్యక్షురాలుగా ఉండి ఇది చదువుతే ఎంత మనోహరంగా ఉంటుంది! ఇటువంటి వ్యాసం రాయడానికి ఎంత ఆలోచించవలసివచ్చిందో. అహంభావముతో కూడుకున్న ఈపాడు ప్రపంచంలో ఇతరులెవరైనా ఇలా సహాయం చేస్తారా?" అనుకొని భర్తను తలచి నమస్కరించింది.

సభరోజున హాల్లో ఇసకేస్తే రాలడంలేదు. ఇదివఱకు అటువంటి సభలకు పురుషులు కొద్దిమందే వచ్చేవారు. కాని ఆసభకు స్త్రీలకన్న పురుషులే ఎక్కువమంది వచ్చారు. అందులో భాగీరథి ఎలావుంటుందో చూద్దామని కొందరూ, ఆమె ఉపన్యాసం వినాలని కొందరూ ఆదుర్దాపడి వచ్చారు. కొంతసేపటికి భాగీరథీదేవి వచ్చిందని గంద్రగోళం ప్రారంభమైంది. అందరూ ఆమెను చూడ్డానికని తోసుకుంటూ లేచారు. ఈసందడంతా ఒక్కమాటు నిశ్శబ్దమైపోయింది. ప్రధానోపాధ్యాయినితో కాశ్మీర సిల్కుచీర కట్టుకుని ముఖమందు నమ్రత, గంభీరము తాండవమాడుచుండగా వచ్చిన భాగీరథియే ఆనిశ్శబ్దమునకు కారణము. భాగీరథీదేవి ఆమెయే యను వాక్యము అక్కడనున్న ప్రతివ్యక్తి ముఖమునుండి వెలువడింది. తరువాత ఆమెను సభకు అధ్యక్షురాలినిగా ఎన్నుకొని; బాలికలకు ఆమెచేత బహుమతు లిప్పించారు. బహుమతు లిచ్చునప్పుడు ఆమె ముఖమునందు వెల్లివిరియుచున్న ఆనందం అనుభవించినవారికే తెలుస్తుంది. తరువాత భాగీరథి ఉపన్యాసం చదవడాని కుపక్రమించింది. అందరూ మాటిమాటికీ కరతాళ ధ్వను లొనర్చుచూ అభినందించుచుండగా భాగీరథి ఎక్కువ ఉత్సాహంతో చదువుతోంది. అంతలో భాగీరథి ప్రధానోపాధ్యాయిని తన్నుగుఱించి ఏమి తలుస్తోందో నని ఆమెవైపు చూడగా ఆమె ఒక ఉత్తరం చదువుతూవుండడం కనిపించింది. ఆ ఉత్తరం చూడగనే భాగీరథి గుండెల్లో దడ ప్రారంభమైంది. వ్యాసంతో పాటు "నీవు కోరినప్రకారం వ్యాసంరాసి పంపుతూన్నా"నని ఈశ్వరశరణ్ రాసినఉత్తరమది. పాటు బాటున ఆమె కాగితాల్లోంచి క్రిందపడి ప్రధానోపాధ్యాయిని చేతుల్లో పడింది. అందరూ

చాలా అభినందిస్తున్నా వినిపించుకోక భాగీరథి త్వరగా ఉపన్యాసం ముగింపుచేసి సరళా దేవిని ప్రక్కగదిలోనికి తీసికెళ్లి "ఉత్తరం సంగతి ఎక్కడా వెల్లడిచేయవద్దు. నాగౌరవం, నాప్రాణం కాపాడవలసిం''దని ప్రార్థించింది. ఆమెకూడా భాగీరథి అవస్థచూసి "ఈఉత్తరం గురించి నానోటినుండి ఒక్కఅక్షరమైనా వెలువడ''దని ప్రమాణంచేసి చెప్పింది. తరువాత భాగీరథి వ్యాసం ఒక్కటీ పత్రికలలో ప్రచురింపబడలేదు.

వజ్రకుమారి వ్యాసములు యథాప్రకారంగా ప్రచురణ అవుతూనే ఉన్నాయి గాని భాగీరథి మనస్సులో మునుపటి ఈర్ష్యపోయి, ఒకవిధమైన కాంతి ప్రవేశించింది. ఇలాఉండగా ఒకరోజున భాగీరథి నిమిత్తమై పదునెనిమిదేండ్ల యువతి వచ్చింది. భాగీరథి ఆమెను గౌర వించి కుశల ప్రశ్నలు చేసిన తరువాత ఆమె తన పేరు వజ్రకుమారి అనియు భాగీరథి దర్శనం చేయాలని వచ్చాననియు తెలియపరచింది. భాగీరథి ఆమెతో "మీవ్యాసములు నాకమితా నందం కలుగజేస్తాయి. పురుషులు వ్యాసములు రాయడం తమకేగాని ఇంకెవ్వరికీ రావని గర్వ పడుతూ ఉంటారు. మీవల్ల అలాంటి ఊహలకి అవకాశం లేదు'' అన్నది.

"మీవ్యాసముల ముందు నావెంత? మీరిప్పుడు వ్రాయడం ఎందుకు విరమించారు? ఆసంగతి తెలుసుకుందామనే నేను వచ్చాను. మీరిలా అశ్రద్ధ చెయ్యడంవల్ల చాలా నష్టం కలుగుతోంది"

"ఏం చెప్పను?''అనుకుంది భాగీరథి.

"ఈశ్వర శరణ్ గారు పార్వతి ముందు ఈశ్వరుని గౌరవందక్కదని ఆటంకపరిచారా!"

"అలాంటి దేమి లేదు. వారికి చాలా ఉత్సాహం."

"అవుతే మీరిలా ఊరుకోడం బాగుండలేదు"

'వ్యాసం రాసే శక్తి నాకేముంది? వారు రాసేవారు. నాపేరుతో పంపేదాన్ని'అని చెపుదామా అనుకొని నాయం దీమె కున్న గౌరవమంతా పోయి, 'ఆహా ఎంత మోసకత్తె!' అని అసహ్యపడుతుం దేమో నని అంది కదా

"ఏదో పనిపాటలవల్ల తీరుబడిలేక విసుగెత్తి..."

"కవిత్వం మనసును విసిగించే వస్తువు కాదే. ఎప్పుడూ చిగుర్చుతూ ఉండే తోట లాంటిది. చంద్రికలు, పక్షుల కోలాహలము, కవిత్వము ఇవి విసిగించే వస్తువులా? అయినా ఇలాంటివి కారణాలు కాగూడదు. మీరు మరల రాయడం ప్రారంభించండి" అని ఎన్నో విధాలచెప్పి వజ్రకుమారి వెళ్ళిపోయింది. ఇదివరకు భాగీరథి ఆమెకూడా ఎవరిచేతనో చెప్పిం చుకొని వ్రాసేదని అనుమానపడింది. కాని ఇప్పు డామెను చూచుటవల్ల ఆమె వాగ్ధోరణి వినుటవల్ల ఆ ఊహ తొలగిపోయింది. "వజ్రకుమారి చిన్నది. ఆమె రాసిందికదా! కష్టపడితే నాకుమాత్రం ఎందుకు రాదు. వజ్రకుమారి కృషిచేసి నేర్చుకోలేదూ? నేను ప్రయత్నిస్తే నాకూ వస్తుంది" అనుకుంటూ ఉద్రేకంతో అప్రయత్నంగా "నేను స్వయంగా రాస్తాను" అంది. వెంటనే దగ్గరనే ఉన్న ఈశ్వర శరణ్ "తథాస్తు"అన్నాడు.

—అనువాదము

376